# నేటి నుంచే నామినేషన్ల పర్వం

- ఉదయం 11గంటల నుంచే ప్రక్రియ షురూ
- ఈ నెల 10 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 3గంటల దాకా స్వీకరణ
- 13న స్క్రూటినీ.. 15న ఉపసంహరణ
- నవంబర్ 30న పోలింగ్.. డిసెంబర్ 3న కౌటింగ్
- నియోజకవర్గాల వారీగా దాఖలుకు ఏర్పాట్లు
- అంతా సిద్ధం చేసిన ఎన్నికల అధికారులు
- ఉమ్మడి జిల్లాలోని 13 చోట్ల ఆర్వో కార్యాలయాలు
- ప్రతి చోటా 144 సెక్షన్ అమలు

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టానికి తెరలేవనున్నది. నేటి నుంచి నామినేషన్ల పర్వం మొదలు కానున్నది. ఉదయం 11 గంటల నుంచి ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల రిటర్నింగ్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవనున్నది. ఈ ప్రక్రియ ఈ నెల 10 దాకా ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగనుండగా, ఎక్కడా ఎలాంటి అవంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారులను ఎన్నికల సంఘం ప్రకటించగా, అన్ని ఆర్వోల పరిధిలో బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. మరోవైపు రాజకీయ వాతావరణం వేడెక్కనున్నది. ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు, బీఫారాలు అందుకొని నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మిగిలిన పార్టీలు ఇంకా తమ అభ్యర్థులను పూర్తి స్థాయిలో ప్రకటించలేని దుస్థితిలో ఉండగా, పలు నియోజకవర్గాల్లో పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు.

కరీంనగర్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : 2023 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నుంచే నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానున్నది. నిజానికి గత నెల 8న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆదే నోటిఫికేషన్‌లో ఎన్నికల షెడ్యూల్‌ను సైతం విడుదల చేసిన విషయం తెలిసిందే. దాని ప్రకారం చూస్తే.. ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రతి రోజూ రిటర్నింగ్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఖచ్చితంగా నిర్దేశిత సమయంలోనే దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ విషయంపై అన్ని రాజకీయ పార్టీలకు అధికారులు అవగాహన కల్పించారు. అంతే కాదు, అభ్యర్థుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత నియోజకవర్గాల్లోనే రిటర్నింగ్ కార్యాలయాలను ఏర్పాటు చేసి.. అక్కడే నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇప్పటికే రిటర్నింగ్ అధికారులను, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సైతం ఎన్నికల సంఘం ఖరారు చేసింది. సంబంధిత కార్యాలయాల్లో ఉన్న ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలను జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పటికే పరిశీలించి.. తగు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా అన్ని రిటర్నింగ్ కార్యాలయాల పరిధిలో నేటి నుంచి 144 సెక్షన్ అమలు చేయనున్నారు. కాగా, ఎక్కడా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నారు.

### ముహూర్తాలు ఖరారు

నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుండడంతో.. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నారు. 3 నుంచి 10 లోపు వారికి కలిసి వచ్చే సమయం కోసం ఇప్పటికే సంబంధిత పండితులను సంప్రదించి తేదీలను ఖరారు చేసుకున్నారు. మరికొంత మంది రెండు లేదా మూడు నామినేషన్ సెట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీల విషయానికొస్తే.. భారత రాష్ట్ర సమితి ఫుల్ జోష్‌లో కనిపిస్తున్నది. మొత్తం 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఆగస్టు 21నే ప్రకటించింది. గత నెల 15 నుంచి బీ ఫారాలు అందించింది. సదరు అభ్యర్థులు ఇప్పటికే ప్రచార ప్రక్రియలో మునిగి తేలుతున్నారు. అంతే కాదు, నామినేషన్ వేసే తేదీలను ఖరారు చేసుకున్నారు. కాంగ్రెస్ ఇంకా సిరిసిల్ల, కరీంనగర్ టికెట్లు ప్రకటించలేదు. అలాగే బీజేపీ పెద్దపల్లి, హుస్నాబాద్, వేములవాడ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేయలేదు.

**ఉమ్మడి జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాయాలు, రిటర్నింగ్ అధికారులు, వారి సెల్ నంబర్ల వివరాలు**

| నియోజకవర్గం పేరు | రిటర్నింగ్ కార్యాలయం | రిటర్నింగ్ అధికారి పేరు | సెల్ నంబర్ |
|---|---|---|---|
| కరీంనగర్ | కరీంనగర్ ఆర్టీవో కార్యాలయం | కే మహేశ్వర్ | 9849904357 |
| చొప్పదండి | చొప్పదండి తహసీల్ కార్యాలయం | ప్రఫుల్‌దేశాయ్ | 9490348725 |
| మానకొండూర్ | మానకొండూర్ తహసీల్ కార్యాలయం | కే లక్ష్మీ కిరణ్ | 7702455155 |
| హుజూరాబాద్ | హుజూరాబాద్ ఆర్డీఓ కార్యాలయం | ఎస్ రాజు | 8247567252 |
| మంథని | మంథని ఆర్డీఓ కార్యాలయం | హనుమానాయక్ | 7995070705 |
| పెద్దపల్లి | పెద్దపల్లి ఆర్డీఓ కార్యాలయం | మధుమోహన్ | 7995070704 |
| రామగుండం | ఎన్టీపీసీ జడ్పీస్కూల్ (రామగుండం) | ఆరుణ శ్రీ | 7995070714 |
| కోరుట్ల | కోరుట్ల ఆర్డీఓ కార్యాలయం | ఎస్ రాజేశ్వర్ | 8886645202 |
| జగిత్యాల | జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం | నరసింహమూర్తి | 7995084611 |
| ధర్మపురి | ధర్మపురి తహసీల్ కార్యాలయం | దయాకర్ | 9063371372 |
| సిరిసిల్ల | సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయం | అనంద్ | 7330888446 |
| వేములవాడ | వేములవాడ ఆర్డీఓ కార్యాలయం | మధుసూదన్ | 7032675222 |
| హుస్నాబాద్ | హుస్నాబాద్ ఆర్టీఓ కార్యాలయం | పి బెన్‌పాలోమ్ | 7331187577 |

### తప్పు జరిగితే తిరస్కరణే

అభ్యర్థుల నామినేషన్ ఫారం పూర్తి చేయడంలో ఏ తప్పు దొర్లినా సదరు నామినేషన్ తిరస్కరణకు గురయ్యే ప్రమాదమున్నది. అందుకే.. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ఎవరిని పడితే వారిని నమ్మకుండా.. ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకున్న తదుపరి మాత్రమే నామినేషన్ దాఖలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. అంతేకాదు, సంబంధిత అధికారులు సైతం అన్ని రాజకీయ పార్టీలకు వివరించారు. దీంతో పాటు నామినేషన్ పత్రం సమర్పణకు అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేంద్ర ఎన్నికల సంఘం ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంచింది. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చూస్తే వివరాలు ఇలా ఉన్నాయి.

- జనరల్‌కు కేటాయించిన నియోజకవర్గాల నుంచి నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ₹10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే ₹5 వేల దరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఇది కూడా బ్యాంకు చలానా ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో విధిగా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సమర్పించాలి.
- ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ప్రజాప్రాతినిధ్య చట్టం –1951 సెక్షన్ 4, 5 ప్రకారం జనరల్ సెగ్మెంట్లలోనూ పోటీ చేయవచ్చు.
- నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి వద్ద దాఖలు చేయడానికి సదరు అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించరాదు.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి రిటర్నింగ్ కార్యాలయానికి వంద గజాల దూరం వరకు మూడు వాహనాలు తీసుకొని వెళ్లవచ్చు. ఎలాంటి ఊరేగింపులకు అవకాశం లేదు.
- ప్రధానంగా అభ్యర్థికి ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవ్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.
- 25 ఏళ్లు నిండిన వ్యక్తి మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడానికి అర్హులు.
- స్వతంత్ర అభ్యర్థులు, అలాగే గుర్తింపులేని పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులకు పది మంది సంబంధిత నియోజకవర్గ ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- పోటీచేసే అభ్యర్థి మాత్రం రాష్ట్రంలోని ఏదో ఒక నియోజకవర్గంలో ఓటర్ అయి ఉంటే సరిపోతుంది.
- నామినేషన్ పత్రాన్ని స్వయంగా కానీ, లేదా ఆన్‌లైన్‌లోని కానీ, లేదా అభ్యర్థి ప్రతిపాదించిన వ్యక్తి గాని రిటర్నింగ్ అధికారికి సమర్పించవచ్చు. ఒక వేళ ఆన్‌లైన్‌లో నామినేషన్ పత్రాన్ని సమర్పించాలనుకునే అభ్యర్థులు ముందుగానే సదరు సమాచారాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తే.. సదరు ఆర్వో స్లాట్ బుక్ చేస్తారు. దాని ప్రకారం నామినేషన్ పూర్తి చేసి సమర్పించాల్సి ఉంటుంది.
- అన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేసినా.. సదరు నామినేషన్ హార్డ్ కాపీని నామినేషన్ల ప్రక్రియ ముగిసేరోజు నాటికి ఖచ్చితంగా సంబంధిత ఆర్వోకు అప్పగించాలి.
- పోటీచేసే అభ్యర్థి నామినేషన్‌కు ఒక రోజు ముందే కొత్తగా బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన ఖర్చుల ఖాతా మొదలవుతుంది. అలాగే, బ్యాంకు అకౌంట్స్ వివరాలు నామినేషన్ ఫారంలో తెలుపాలి.
- నామినేషన్ దాఖలు చేసే ప్రతి అభ్యర్థి పది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలి.
- నేర చరిత్ర, పోలీసు కేసులు, స్థిర చరాస్తులు, అప్పులు వంటివి అభ్యర్థితో సహా కుటుంబ సభ్యుల వివరాలు అఫిడవిట్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.
- నామినేషన్ రిటర్నింగ్ అధికారికి అందించిన తర్వాత రిటర్నింగ్ అధికారి ముందు ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు సమర్పించవచ్చు.
- ఒక్కో అభ్యర్థి ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి నాలుగుకు మించి నామినేషన్ సెట్లు వేయరాదు.
- అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన, పోటీకి అర్హత ప్రకటించడం రిటర్నింగ్ అధికారికి మాత్రమే ఉంటుంది.

# నేడు కోరుట్లకు అధినేత కేసీఆర్

- ప్రజాశీర్వాద సభకు రాక
- పెద్దగుండు వద్ద 12 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న ప్రజలు
- చిన్నా, పెద్దా తరలిరావాలి : ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, అభ్యర్థి డా. సంజయ్

మెట్‌పల్లి,నవంబర్2: ఎన్నికల ప్రచారంలో భాగంగా కోరుట్లలో శుక్రవారం సాయంత్రం జరిగే ప్రజాఆశీర్వాద సభకు రాష్ట్ర రథసారథి, బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రానున్నారు. 63వ జాతీయ రహదారి పక్కన పెద్దగుండు ప్రాంతంలో సుమారు 12 ఎకరాల స్థలంలో తలపెట్టిన సభ కోసం ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆశీర్వాద సభ వేదిక, వేదిక ముందు ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్‌కు జాతీయ రహదారికి అవతలి వైపు స్థలాన్ని కేటాయించారు. సభ వేదికకు సమీపంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగనుండగా, ముఖ్యమంత్రి కేసీఆర్ అదే సమయానికి హెలీకాప్టర్‌లో అక్కడికి చేరుకుంటారు. బహిరంగ సభకు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి మండలాల్లోని నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సభావేదిక, హెలీప్యాడ్, పార్కింగ్‌కు సంబంధించి ఏర్పాట్లను రెండు రోజుల కిందట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. పోలీస్ అధికారులకు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు.

### విజయవంతం చేయాలి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డా. కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కోరుట్ల,మెట్‌పల్లి పట్టణాలతో పాటు ఇబ్రహీంపట్నం, కోరుట్ల, మెట్‌పల్లి,మల్లాపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు వస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



కోరుట్లలో జాతీయ రహదారి పక్కన పెద్దగుండు ప్రాంతంలో సిద్ధమవుతున్న వేదిక